క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఆలమూరు: మండలంలోని చెముడులంకలోని ఎస్‌టీఎస్ఎస్ఎస్ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆ గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాసు శనివారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా అందిస్తున్న భోజనం నాణ్యత లేదని పలువురు విద్యార్థుల ఫిర్యాదు మేరకు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించినట్లు సర్పంచ్ తెలిపారు. జెడ్పీ హైస్కూల్‌లో ఏవిధమైన ఇబ్బందులు ఉన్నా సత్వరమే ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు యూనిఫాం బహూకరణ



కళాశాల విద్యార్థులకు అందజేస్తున్న యూనిఫాం

పి.గన్నవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు శనివారం యూనిఫాం బహూకరించారు. అలాగే వారి పరీక్షల ఫీజును ఎస్ఎంసీ చైర్మన్ నల్లా దుర్గారావుతో పాటు వికలాంగ పింఛన్ పొందుతున్న ఎ.నాగేశ్వరరావు, బి.భాస్కరరావులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, ఇళ్ల రాంబాబు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం

కొత్తపేట: మండలంలోని పలివెలలో శనివారం ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించారు. కొత్తపాలెం స్పందన పీపుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విలస జోసఫ్ మెమోరియల్ ఆస్పత్రి వారి సౌజన్యంతో పలివెల ధర్మశాల ప్రాంగణంలో నేత్ర, దంత పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దంగేటి రవికుమార్, కోఆర్డినేటర్ పి.జాన్‌విక్టర్, ఉపాధ్యక్షుడు దంగేటి రాజ్‌కుమార్, డాక్టర్ లాజర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం కోశాధికారి రమణమూర్తి మృతి



శ్రీఘాకోళ్లపు వెంకటరమణమూర్తి

కొత్తపేట: స్థానిక పూర్వపు తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కోశాధికారి శ్రీఘాకోళ్లపు వెంకటరమణమూర్తి (80) మృతి చెందారు. గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురైన రమణమూర్తి రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుది శ్వాస విడిచినట్టు సంఘ ప్రధాన కార్యదర్శి అజ్జరపు వెంకటసుబ్బారావు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

దివ్యాంగుల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెం: ఈ నెల 5 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ దివ్యాంగులకు అవసరమైన పరికరాల గుర్తింపునకు శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఈ.మహేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎస్‌వీఎస్ బాయ్స్ హైస్కూల్‌లో అలీంకో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు శనివారం ఆయన తెలిపారు. ఈ శిబిరంలో పరికరాలు సరఫరా చేయుటకు గుర్తింపు కోసం మాత్రమేనన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దివ్యాంగులంతా ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే ఫైన్

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల వద్ద, ఆలయాల వద్ద బహిరంగ ప్రాంతాల్లోనూ ధూమపానం చేస్తే ఫైన్ కట్టాల్సిందేనని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. అంబాజీపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా టుబాకో కంట్రోల్ ప్రోగ్రాం కౌన్సిలర్ కె.ప్రమీల ఆధ్వర్యంలో పొగాకు వల్ల నష్టాలు పోస్టర్లను స్థానిక హైస్కూల్, పాన్ షాపుల వద్ద శనివారం అతికించారు. ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, దేవాలయాలు, పెట్రోల్ బంక్‌ల సమీపాన ధూమపానం చేయడం, విక్రయించడం చేయకూడదన్నారు. ఎవరైన బహిరంగంగా ధూమపానం చేస్తే వారికి టుబాకో యాక్టు నిబంధనల మేరకు రూ.200 స్పాట్ ఫైన్ విధిస్తామన్నారు.

6వ తేదీన టేకు కలప దుంగలకు వేలం

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిల్వ ఉన్న టేకు కలపకు ఈనెల ఆరున వేలం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాలకు సంబంధించి 26 టేకు కలప దుంగలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ వేలంలో రూ.500 తిరిగి చెల్లించని ధరావత్తును చెల్లించి వేలంపాట దారుడు రిజిస్ట్రేషన్‌ను చేయించుకోవాలన్నారు. వేలం పాట రోజున ముందస్తుగా రూ.ఐదు వేలు చెల్లించాలన్నారు. ఆసక్తి కలిగిన వారు కళాశాలకు వచ్చి టేకు దుంగలను పరిశీలించుకోవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

వన సమారాధనలకు వేళాయె..

- నేడు కార్తిక తొలి ఆదివారం
- వనసమారాధనలు ప్రారంభం



పచ్చని చెట్ల మధ్య లొల్ల లాకుల అందాలు

కొత్తపేట: కార్తికమాసం వచ్చిందంటే వయసుతో సంబంధం లేకుండా పిల్లలు, పెద్దలు, స్నేహితులు, విద్యార్థులు, వివిధ కుల, కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు (పిక్నిక్‌లు) నిర్వహిస్తారు. స్నేహితులు, కుటుంబాలు, సంఘాల్లో సభ్యులు ఐక్యంగా ఉసిరి చెట్ల కింద, మామిడి, జీడిమామిడి, కొబ్బరి తోటల్లో చేరి ఆటపాటలతో సందడి చేస్తారు. మధ్యాహ్నం అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేస్తారు. అందుబాటులో ఉండే నదులు, సముద్రాల్లో పుణ్యస్నానాలు ఆచరించి, సమీప ఆలయాల్లో దైవదర్శనాలు చేసుకుని సాయంత్రానికి ఇళ్లకు చేరుకుంటారు. కార్తికమాసంలో ఎక్కువగా ఆదివారం రోజుల్లో వన విహారాలు, వన సమారాధనలు ఏర్పాటు చేసుకుంటారు. నేడు మొదట ఆదివారం కావడంతో పలు వర్గాల వారు వన సమారాధనలు ఏర్పాటు చేసుకున్నారు. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో వన సమారాధనలకు అనువైన ప్రాంతాలు (పిక్నిక్ స్పాట్లు) ఎన్నో ఉన్నాయి.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు

కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, కొత్తపేట మండలం పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి, ఆలమూరు మండలం జొన్నాడలో ఉమా విశ్వేశ్వరస్వామి ఆలయాలున్నాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో అయినవిల్లి వరసిద్ధివినాయకస్వామి, ముక్తేశ్వరంలో క్షణముక్తేశ్వరస్వామి, అంబాజీపేట మండలం వ్యాఘ్రేశ్వరంలో వ్యాఘ్రేశ్వరస్వామి, మామిడికుదురు మండలంలో అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం, రాజోలు నియోజకవర్గంలో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి తదితర ఆలయాలున్నాయి. ఈ కార్తిక మాసంలో ముఖ్యంగా సోమవారాల్లో ఆయా ఆలయాలను సందర్శిస్తారు.

పిక్నిక్ స్పాట్స్..

కార్తికమాసంలో ముఖ్యంగా ఆదివారాల్లో అనేక మంది పర్యాటక ప్రాంతాలను సందర్శించి ఉత్సాహంగా ఉల్లాసంగా గడుపుతారు. కొత్తపేట నియోజకవర్గంలో ఆత్రేయపురం మండలం లొల్లలాకులు, బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక పర్యాటక కేంద్రాలుగా ఖ్యాతికెక్కాయి. పరవళ్లు తొక్కుతూ సోయగాలొలుకుతూ లొల్ల లాకుల నుంచి విడుదలవుతున్న సాగునీరు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఆ ప్రాంతం కార్తికమాసంలో పర్యాటకులతో కొత్త శోభ సంతరించుకుంటుంది. సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు కోనసీమలో సాగు నీటి వ్యవస్థ నిర్వహణకు లాకులను నిర్మించారు. లాకులు గేట్లు ఎత్తే సమయాల్లో వాటి నుంచి ఎగసి పడుతూ ప్రవహించే నీటి కెరటాలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి లొల్ల లాకుల వరకు ప్రవహించే ప్రధాన పంట కాలువ లొల్ల లాకుల వద్ద ముక్తేశ్వరం, అమలాపురం, పి.గన్నవరం కాలువలుగా విడిపోతుంది. ఆ మూడు కాలువలకు నీరు వెళ్లే దృశ్యాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. దీంతో జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి కార్తికమాసంలో లొల్ల లాకుల వద్ద కార్తిక సమారాధనలు జరుపుకొనేందుకు పర్యాటకులు వేలాదిగా తరలివచ్చి అక్కడ నుంచి పిచ్చుకలంకను సందర్శిస్తారు. కొత్తపేట సమీపాన కపిలేశ్వరపురం మండలం వీధివారిలంకలో ధనమ్మతల్లి కొలువైన ధనమ్మమర్రి ప్రాంతం, మందపల్లి–రావులపాలెం మధ్య కాశీరాజుగారి తోట, రాజోలు నియోజకవర్గంలో దిండి రిసార్ట్స్, పి.గన్నవరం అక్విడెక్ట్ తదితర ప్రాంతాల్లో వనసమారాధనలు జరుపుకొంటారు.

నదుల వద్ద అప్రమత్తం

గౌతమి, వశిష్ఠ నదులు, సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు, వనసమారాధనలు సందర్భంగా స్నేహితులతో సరదాగా స్నానాలకు దిగే వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉత్సాహంలో నిర్లక్ష్యం వహిస్తే కనురెప్ప పాటులో పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఈ నెల 3, 10, 17, 24 తేదీల్లో ఆదివారాలు వచ్చాయి. డిసెంబరు 2 తేదీ పాడ్యమి పుణ్యస్నానాలు, ఆకాశ దీపారాధనతో కార్తికమాసం ముగియనుంది.

108 అంబులెన్స్‌లో సుఖ ప్రసవం



నవజాత శిశువుతో 108 ఉద్యోగులు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామానికి చెందిన చందన శనివారం తెల్లవారుజామున పురిటి నొప్పులతో బాధపడింది. వెంటనే ఆమె కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు ఫోన్ చేశారు. వారు హుటాహుటిన ఆమె ఇంటికి చేరుకుని అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో నొప్పులు అధికమయ్యాయి. అబ్‌నార్మల్ కండిషన్‌లో ఉన్న ఆమెకు ఈఎంటీ ప్రియదర్శిని, గర్భిణి కుటుంబ సభ్యులు, ఆశ కార్యకర్త, పైలట్ పి.రవి సహకారంతో చాకచక్యంగా డెలివరీ చేశారు. చందన పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. నవజాత శిశువుకు వైద్యం అందించి, ఆక్సిజన్ పెట్టి సమీప ఆస్పత్రికి పంపించారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండడంతో అంతా సంతోషించారు. 108 అంబులెన్సు ఉద్యోగులను చందన బంధువులు అభినందించారు.

చెస్ క్రీడాకారులకు అభినందనలు



చెస్ క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రావులపాలెం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయి అంతర్ కళాశాలల చెస్ చాంపియన్ షిప్ పోటీలు ఇటీవల భీమవరం బీవీ రాజ్ కళాశాలలో జరిగాయి. ఈ చెస్ చాంపియన్‌షిప్‌లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని తృతీయస్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. చెస్‌లో తమ విద్యార్థులు రసూల్, నిర్మల్, గోపి, చందులు ప్రతిభ చూపి తృతీయ స్థానాన్ని కై వసం చేసుకున్నారన్నారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు స్పోర్ట్స్ ఇన్‌చార్జి చినబాబు, అధ్యాపకులు నర్సారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ యువరాజు అభినందించారు.

అపార్ నమోదు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సలీం బాషా

రావులపాలెం: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆటోమోటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదును వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) షేక్ సలీం బాషా పిలుపునిచ్చారు. స్థానిక సెయింట్ ప్యాట్రిక్స్ పాఠశాల సమావేశ హాలులో శనివారం మండల విద్యాశాఖ సిబ్బంది, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెట్లతో సమావేశాన్ని నిర్వహించారు. రామచంద్రపురం డీవైఈవో శ్రీపాద నరసింహఫణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఈఓ సలీం బాషా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరూ అపార్ ఎన్‌రోల్‌మెంట్ పరిధిలోకి రావాలన్నారు. అపార్ నమోదును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించాలని డీఈఓ సూచించారు. సమావేశంలో డీవైఈఓ శ్రీపాద నరసింహ ఫణి, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు, ఎంఈవోలు పలు అంశాలను వివరించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రణాళికా బద్ధంగా విద్యాబోధన అందించాలని డీఈవో షేక్ సలీమ్ బాషా ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. డీఈఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం ఎంఈఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. నియోజకవర్గంలో ని నాలుగు మండలాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, యూనియన్ల నాయకులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, వాటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి విద్యార్థికి విద్యాబోధన సక్రమంగా అందించాలని, రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ప్రతిభను చూపే విధంగా ప్రణాళిక రచించి అమలు చేయాలని వారికి సూచించారు. తొలిసారి కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా డీఈఓ సలీం బాషాను మండల అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మర్యాదపూర్వకంగా కలిశారు. డీఈఓ వెంట ఇన్‌చార్జ్ డీవైఈఓ ఫణికుమార్, డీసీఈబీ సెక్రటరీ హనుమంతరావు, సమగ్ర శిక్ష సీఈఓ బొరుసు సుబ్రహ్మణ్యం, స్థానిక ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి తదితరులు ఉన్నారు.

ఇసుక తీసేందుకు అనుమతి ఇవ్వాలి

పి.గన్నవరం: నియోజకవర్గాన్ని సీఆర్‌జెడ్ పరిధి నుంచి తొలగించి బోట్స్‌మన్ సొసైటీలకు ఇసుక తీసుకునేలా అనుమతులు ఇప్పించాలని కోరుతూ ఆ సొసైటీల నాయకులు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు శనివారం వినతిపత్రం అందించారు. పి.గన్నవరం నియోజకవర్గాన్ని సీఆర్‌జెడ్ పరిధిలోకి తీసుకురావడం వల్ల బోట్స్‌మన్ సొసైటీలు ఇసుక తీసుకునేందుకు అవకాశం లేదని, ఆ కారణంగా తాము జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని సభ్యులు వివరించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు కూడా వినతిపత్రం అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అవసరాలకు, ఇతర పనులకు ట్రాక్టర్లపై ఉచితంగా ఇసుక తీసుకువెళ్లవచ్చన్నారు. కలెక్టర్‌ను కలసిన వారిలో బోట్స్‌మన్ సొసైటీల నాయకులు శేరు శ్రీనుబాబు, పెమ్మాడి మారుతీ కృష్ణమోహన్, కొల్లు రాంబాబు, కోలా రాంబాబు, మల్లాడి విష్ణు, మల్లాడి గోపి తదితరులు ఉన్నారు.

రూ.17 కోట్లతో గుంతల పూడ్చివేత పనులు



రోడ్డు మరమ్మతులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కలెక్టర్ మహేష్‌కుమార్

పి.గన్నవరం: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడతుందని జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ అన్నారు. గుంతలు రహిత మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పలు రహదారులపై సుమారు 200 కిలోమీటర్ల మేర గుంతల పూడ్చివేతకు రూ.17 కోట్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా రూ.1.7 కోట్లతో పి.గన్నవరం మండలం పోతవరం నుంచి కె.ఏనుగుపల్లి బాలాజీ ఫెర్రీ రోడ్‌కు 4.62 కిలోమీటర్ల మేర రహదారికి మరమ్మతు చేసి తారు రోడ్డు వేసేందుకు శనివారం కలెక్టర్ మహేష్ కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలు భూమిపూజ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్లు గుంతల రహిత రోడ్లుగా తీర్చిదిదేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఇందులో భాగంగా జిల్లాకు మరో రూ.40 కోట్లు మంజూరు కానున్నాయని ఆయన వివరించారు. రోడ్ల పక్కన ఉన్న చెట్లు తొలగింపు తదితర క్లియరెన్స్ కోసం మరో రూ.20 కోట్లు నిధులు వస్తాయన్నారు. కార్యక్రమాల్లో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాము, డీఈ రాజేంద్ర, సర్పంచ్‌లు వడలి కొండయ్య, బొండాడ నాగమణి, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, నాయకులు డీవీవీ సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, సాధనాల జేడీ, యర్రంశెట్టి సాయిబాబు, సంసాని పెద్దిరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శివాలయానికి మైక్‌సెట్ సమర్పణ



మైక్ సెట్ సమర్పించిన అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని నీలకంఠేశ్వరస్వామివారి దేవస్థానానికి అంతర్వేది దేవస్థానం గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ సంఘం రూ.50 వేలు విలువైన మైక్ సౌండ్ సిస్టం సమర్పించారు. ఈ మేరకు ఈ సిస్టంను శివాలయం అర్చకులకు, అంతర్వేది దేవస్థానం సిబ్బందికి అందజేశారు.

పంటల ప్రగతిని రైతులకు చేరవేయాలి

అంబాజీపేట: రానున్న రోజుల్లో వ్యవసాయ, ఉద్యాన పంటల ప్రగతిని రైతులకు చేరవేసి వారి ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడాలని ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు అన్నారు. వెంకటరామన్నగూడెంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన కళాశాలలో 4వ ఏడాది బీఎస్సీ (హార్టీకల్చర్) 23 రావేప్ విద్యార్థులు అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రానికి శనివారం అనుసంధానమయ్యారు. కేంద్ర అధిపతి డాక్టర్ చలపతిరావు మాట్లాడుతూ వ్యవసాయ క్షేత్రంలో రైతులతో మమేకమైతే ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చన్నారు. వివిధ ఉద్యాన పంటల్లో ఆచరించే సేద్య పద్ధతులను క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా రైతులతో మమేకమై నేర్చుకోవడంతో పాటు, ఆధునిక శాస్త్ర పద్ధతులను రైతుల ద్వారా ఆచరించేటట్లు చేయాలని రావేప్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వి.వెంకటరెడ్డి, భీమరాజు, 23 మంది రావేప్ విద్యార్థులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం



మామిడికుదురులో రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వరప్రసాద్

మామిడికుదురు: గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. ఐ.ఇంపాక్ట్ నిధులు రూ.2.10 కోట్లతో మామిడికుదురు నుంచి గోగన్నమఠం వరకు చేపట్టనున్న ఆర్ అండ్‌బీ రోడ్డు ఆధునీకరణ పనులకు శనివారం ఎమ్మెల్యే మామిడికుదురులో శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.51 కోట్లతో 102 కిలోమీటర్ల మేర పాడైపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, కూటమి నేతలు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు చర్యలు

కొత్తపేట: నియోజకవర్గంలో వివిధ రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. మండలంలోని పలివెల–పల్లిపాలెం రోడ్డు గోతులు పూడ్చే కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోడ్ల మరమ్మతుల నిమిత్తం నియోజకవర్గానికి రూ.5 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. దానిలో భాగంగా ఈ పలివెల రోడ్డు మరమ్మతులకు రూ.30 లక్షలు మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గంలో 15 మందికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం మంజూరు కాగా ఆ మంజూరు పత్రాలను ఆయా లబ్ధిదారులకు వాడపాలెంలో ఎమ్మెల్యే సత్యానందరావు అందజేశారు. కార్యక్రమాల్లో కంఠంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ సాదే లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.48 కోట్లు మంజూరు

ఆలమూరు: మండలంలోని అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల మరమ్మత్తుల కొరకు రూ 1.48 కోట్లు మంజూరైనట్లు రామచంద్రపురం ఆర్‌అండ్‌బీ డీఈ సూర్యనారాయణరాజు తెలిపారు. ఈసందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జొన్నాడ నుంచి మండపేట వెళ్లే రోడ్డుకు రూ.60 లక్షలు, కడియం నుంచి వెదురుమూడి వెళ్లే రోడ్డుకు రూ.60 లక్షలు, గుమ్మిలేరు నుంచి నర్శిపూడి వెళ్లే రోడ్డుకు రూ.20 లక్షలు, మడికి నుంచి దుళ్ల వెళ్లే రోడ్డుకు రూ. ఎనిమిది లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈనెల నాలుగో తేదీ లోపు టెండర్లు ఖరారు చేయడం జరుగుతుందని డీఈ పేర్కొన్నారు.

ప్రధానమంత్రి ఫొటో ముద్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాలే శ్రీనివాస్‌నగేష్

మలికిపురం: సంక్షేమ పథకాల అమలు బోర్డులపై ప్రధానమంత్రి మోదీ ఫొటోను ముద్రించడం లేదని బీజేపీ నాయకుల సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం మలికిపురంలో ఇందుకూరి అచ్యుతరామరాజు ఇంటి వద్ద బీజేపీ నాయకుల సమావేశం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అడబాల రాంబాబు అధ్యక్షతన జరిగింది. జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ ఫొటోలు పెట్టే విధంగా సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్ చొరవ చూపి అవసరమైతే చట్టబద్ధత కోసం ప్రభుత్వం జీవోను తెచ్చి ప్రధాని ఫొటోను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.45 వేల కోట్లు విడుదల చేసిందని దీనికి పల్లెపండగ పేరుతో రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వం ఘనంగా నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. అధికారులు వాటిపై సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్ ఫొటోలు ముద్రించారే తప్ప దేశ ప్రధాని మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ విచారం వ్యక్తం చేస్తుందన్నారు. రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చంపాటి శివరామకృష్ణంరాజు, కిసాన్ మోర్చా నాయకులు ఇందుకూరి అచ్యుతరామరాజు, బూత్ కమిటీ అధ్యక్షుడు కేతా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

అంబాజీపేట: స్థానిక డైలీ మార్కెట్, కముజువారిపేటలో పంచాయతీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ పర్యవేక్షణలో శనివారం పంచాయతీ పారిశుధ్య కార్మికులతో శానిటేషన్ పనులు చేయించారు. డైలీ మార్కెట్‌లో పేరుకుపోయిన చేపలు, మాంసం వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. అలాగే కముజువారిపేటలోను పారిశుధ్యం చేసి బ్లీచింగ్ చల్లించారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ–ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్లు ద్వారా దేవస్థానానికి రూ.1,36,245, అన్నప్రసాదం విరాళాలు రూపంలో రూ.22,413తో మొత్తం రూ.1,58,758 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.

అక్షరాస్యతను పెంపొందించేందుకే 'ఉల్లాస్'



ఆలమూరులో జరిగిన ఉల్లాస్ కార్యక్రమానికి హాజరైన స్వచ్ఛంద మహిళ విద్యా బోధకులు

ఆలమూరు: అక్షరాస్యతను పెంచే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) అనే వయోజన విద్యను గ్రామాల్లో నిరక్షరాస్యులకు అందించాలని కాకినాడ నుంచి విచ్చేసిన ప్రత్యేక నోడల్ అధికారి విజయభాస్కర్ అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ.రాజు అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించగా నోడల్ అధికారి విజయ భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలో గుర్తించిన 800 మంది నిరక్షరాస్యులకు రాత్రి వేళల్లో విద్యను అందించేందుకు గ్రామ యానిమేటర్ల సహకారంతో 80 మందిని స్వచ్ఛంద మహిళ విద్యా బోధకులను నియమించామన్నారు. ఒక్కో మహిళా బోధకురాలు గుర్తించిన ప్రదేశాలు, కార్యాలయాల్లో ప్రతి రోజు పది మంది వయోజనులకు విద్యను అందించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. నవంబర్ ఐదు నుంచి మార్చి 04 వరకూ ఐదు నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. వయోజనులకు శిక్షణ పూర్తయిన అనంతరం మహిళ విద్యా బోధకులకు ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించనున్నామని నోడల్ అధికారి విజయ భాస్కర్ పేర్కొన్నారు. ఏపీఓ ఎం.ధనరాజు, సీసీ కె.భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



నగరంలో వీరభద్రస్వామికి నిర్వహిస్తున్న అభిషేకాలు

మామిడికుదురు: శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తికమాసం ప్రారంభం కావడంతో శనివారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున భక్తులు ఆలయాలకు వెళ్లి అభిషేకాలు చేయించుకున్నారు. నగరం గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా విఘ్నేశ్వరపూజ, వీరభద్రస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భద్రకాళీ అమ్మ వారికి లక్ష కుంకుమార్చన వైభవంగా జరిపించారు. లక్ష మారేడుదళాలతో అర్చన చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పం, సూర్య నమస్కారాలు, చండీహోమం, రుద్రహోమం, జ్యోతిర్లింగార్చన తదితర పూజలను ఘనంగా జరిపించారు. పలువురు భక్త దంపతులు లక్ష బిల్వార్చన పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. పూజ్యం జగన్నాథశర్మ, విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రామేశ్వరపు వీరభద్రం పర్యవేక్షణలో ఈ పూజా కార్యక్రమం జరిగింది.

ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌పై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సాయిబాబు

రాజోలు: ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌పై విద్యార్థులకు అవగాహన అవసరమని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. శనివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏపీ రీజినల్ ఆఫీసు ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అంశంపై వాణిజ్య శాస్త్ర విభాగం పర్యవేక్షణలో సెమినార్ నిర్వహించారు. ఆర్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ కె.ఉదయ్‌తేజ, యూనియన్ బ్యాంక్ లీడ్ జిల్లా మేనేజర్ కేశవ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. క్రెడిట్, డెబిట్ కార్డు వినియోగం, ఆన్‌లైన్ మోసాలను గుర్తించడం తదితర అంశాలను వివరించారు. ఆర్‌బీఐ నిబంధనలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాణిజ్య, వ్యాపార రంగాల్లో అవకతవకలను గుర్తించాలన్నారు. వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పీపీ చంద్రబోస్, గోపాలకృష్ణ, నల్లి రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.